Reg. No.3435/57 Postal Reg. No. H/HD 901/2006-8

# ధర్మసాధని

సాంస్కృతిక, సాంఘిక, ఆధ్యాత్మిక ఆశయములను ప్రచారము చేయు పత్రిక
ఆంధ్రబ్రహ్మ సమాజ పక్షమున 1914 నుండి ప్రచురింపబడుచున్నది.

# DHARMASADHANI

A JOURNAL IN TELUGU & ENGLISH DEVOTED TO SPIRITUAL, MORAL, SOCIAL AND CULTURAL IDEALS, PUBLISHED BY ANDHRA BRAHMO SAMAJAM SINCE 1914

సంపుటి (22) November నవంబర్ 2018 సంచిక (6)



Editor : Ravi Sankar Banda Associate Editor : Ch.Keshav Chand

చిరునామా : హైదరాబాద్ దక్కన్ బ్రహ్మ సమాజ మందిరము, హనుమాన్ టేకిడి, అబిడ్స్, హైదరాబాదు - 500 001.
Address : Hyderabad Deccan Brahma Samaj Mandir, Hanuman Takedi, Abids, Hyderabad - 500 001.

Telephone : 07093927442, 07093927443

E-mail :info@dharmasadhani.org website : www.dharmasadhani.org

సంపాదక వర్గము :

దాములూరి మధు బిందు, సిలువేరు సుదర్శన్, దేవగుప్తాపు సార్వభౌమారావు

Printed & Published by M. Ajay Gowtham for the Andhra Brahmo Samaj, Hyderabad
Printed at Saptagiri Printing Works, Vidyanagar, Hyderabad - 500 044.

చందా : రూ. 100/- (3 సం॥లకు) పోషకులు (PATRON) రూ. 500/- విడి పత్రిక :రూ. 10/-

## విషయ సూచిక


| | | | | |
|---|---|---|---|---|
| 1. | సంపాదకీయం | : | బందా రవి శంకర్ | 1 |
| 2. | సృష్టికర్తతో సంభాషణ | : | స్వేచ్ఛానువాదం : డా.జ్యోత్స్నా ఇలియాస్ | 4 |
| 3. | బ్రాహ్మధర్మము | : | మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్ | 5 |
| 4. | మూర్తిపూజ | : | స్వామి దయానంద సరస్వతి | 7 |
| 5. | గొట్టాలమ్మ సభ | : | శ్రీ కందుకూరి వీరేశలింగం | 10 |
| 6. | ధర్మరాజు – ఆచార్యుడు | : | శ్రీదేవి | 12 |
| 7. | శ్రీ నాభి జగన్నాథరావు | : | సిలువేరు సుదర్శన్ | 14 |
| 8. | Random Acts of Kindness. | : | Rajesh | 15 |
| 9. | Brahmo Samaj and The Social Emancipation of Women | : | Dr. Gargi Chakravartty | 16 |
| 10. | సమాజ వార్తలు | : | | 21 |
| 11. | సందేశములు, విరాళములు | : | | 22 |
| 12. | 128th Brahmo conference | : | | 23 |
| 13. | బ్రహ్మ సమాజ క్యాలెండర్ ( నవంబర్, డిశంబర్) | : | చల్లా కేశవచంద్ | 24 |


బ్రహ్మ సమాజమును శ్రీ రాజా రామ్మోహన్ రాయ్ 1828లో స్థాపించారు. అత్యంత ప్రాచీనములు, సనాతనములైన వేద గ్రంథాలలో వివరించబడిన ఏకేశ్వరోపాసన, సర్వమత సౌభ్రాతృత్వం, హేతుపూర్వక మత దృక్పథం, వసుధైకకుటుంబం వంటి సిద్ధాంతాలను అనుసరించు వారి సమూహమే బ్రహ్మసమాజం. మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్, బ్రహ్మానంద కేశవచంద్ర సేన్, పండిట్ శివనాథ శాస్త్రి, కందుకూరి వీరేశలింగం పంతులు, బ్రహ్మర్షి రఘుపతి వెంకట రత్నం నాయుడు మొదలైన వారు దీనిని ఎంతో వ్యాప్తి చేసారు.



DHARMASADHANI

# ధర్మసాధని

సాంస్కృతిక, సాంఘిక, ఆధ్యాత్మిక ఆశయములను ప్రచారము చేయు పత్రిక
ఆంధ్రబ్రహ్మసమాజ పక్షమున 1914 నుంచి ప్రచురింపబడుచున్నది.

సంపుటి (22) November నవంబర్ - 2018 సంచిక (6)

సంపాదకీయం

## సరస్వతి - లక్ష్మి

- బందా రవి శంకర్

గత సంచిక యందు పరమేశ్వరుని యొక్క "గణపతి:" అను నామము మరియు దానికి సంబంధించిన అపోహల గురించి వివరముగా తెలుసుకున్నాము. ఈ సంచిక యందు సరస్వతి, లక్ష్మి ఇత్యాది పరమేశ్వరుని దివ్య నామముల గురించి, ఆ నామముల పట్ల గల అపోహల గురించి తెలుసుకొందాము.

పరమేశ్వరుడు లింగము, వచనము, నామము, రూపము, గోత్రము, మతము, కులము, కాలము, ప్రాంతము ఇత్యాదులకు అతీతుడని, ఈ విషయములు వేదముల యందు పలుమార్లు తెలుపబడినవని తెలుసుకున్నాము. పరమేశ్వరుడు లింగ వాచకములకు అతీతుడు కావున ఆయనను మానవుల లాగా స్త్రీ, పురుష, నపుంసక ఇత్యాది నామ, రూపాలలో ఆరోపించి, పరిధీకృతము చేయకూడదని గ్రహించవలెను. అజన్ముడు మాత, పిత, పుత్ర, కళత్రాది అన్ని బంధములకు అతీతుడైన పరమేశ్వరుడిని వేదముల యందు సరస్వతి, లక్ష్మి, బ్రహ్మ, విష్ణు:, శివ: ఇత్యాది దివ్యమైన నామములతో పలుమార్లు కీర్తించారు. కాని కాలక్రమములో సరస్వతి, లక్ష్మి మొదలగు పరమేశ్వరుని నామములకు స్త్రీ రూపములను, బ్రహ్మ, విష్ణు:, శివ: ఇత్యాది పరమేశ్వర నామములకు పురుష రూపములను కల్పించారు.

వేదముల యందు లక్ష్మి, సరస్వతి నామములకు తెలుపబడిన అర్థములను ఇప్పుడు పరిశీలిద్దాం. అందరికీ జ్ఞానమును ప్రసాదించువాడు, అన్ని రకములైన జ్ఞానములకు మూలాధారుడు కావున పరమేశ్వరుడిని సరస్వతి అని (సారస్వతం దదాతి ఇతి: సరస్వతి), అన్ని రకముల దారిద్ర్యములను (భావ దారిద్ర్యము, ధన దారిద్ర్యము మొదలగునవి) నశింప చేసి నిజమైన ఐశ్వర్యమును ప్రసాదించువాడు కావున పరమేశ్వరుడిని లక్ష్మి అని వేదములలో (లయేత్ క్ష్మిమ్ ఇతి: లక్ష్మి) తెలిపారు. క్రింద వేద మంత్రములు ఈ విషయములను ధృవీకరించుచున్నవి.

**పావకా న: సరస్వతీ వాజేభిర్వాజినీవతీ।**
**యజ్ఞం వష్టు ధియావసు:॥ (ఋగ్-1-3-10)**

**తాత్పర్యము:** సమస్త విద్యలకు పరమేశ్వరుడే మూలము. ప్రజలెల్లరు అన్ని రకముల విద్యల కొరకు ఆయననే అర్థించవలెను. యజ్ఞముల యందు వేదోక్తవాణుల స్తుతులతో ఆయననే స్తుతించవలెను.

**శ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యావహో రాత్రే పార్శ్వే: నక్షత్రాణి రూపమశ్వినౌవ్యాత్తమ్ ఇష్ణన్నిషాణాముం మఉ ఇషాణ సర్వలోకం మఉ ఇషాణ॥ (యజు:-31-22)**

**తాత్పర్యము:** పరమేశ్వరుడు సకలైశ్వర్యశాలి, సర్వజ్ఞుడు, మహామహిమాన్వితుడు, అత్యంత దయగలవాడు. ఆయనయే సమస్త విశ్వమునకు మేలు చేయుచున్నాడు. రాత్రింబవళ్ళను, నక్షత్రాదులను, సమస్త విశ్వమును నియమబద్ధంగా నడిపించుచున్నాడు. ఆయనయే మానవులందరి యొక్క అన్ని రకముల దారిద్ర్యమును నశింపచేసి మోక్షమును పొందుటకు అవసరమైన ఆత్మజ్ఞానమును ప్రసాదించువాడు. కావున ప్రజలెల్లరు తమ యొక్క మరియు ఎల్లరి యొక్క ఇహపర సౌఖ్యముల కొరకు పరమేశ్వరుడినే ప్రార్థించవలెను.

ఇంత గొప్పగా, స్పష్టంగా వేదములో పరమేశ్వరుడిని లక్ష్మి, సరస్వతి నామములతో కీర్తించినప్పటికీ కాల

క్రమములో పురాణ, ఇతిహాసముల యందు ఈ నామములను వక్రీకరించి అనేక కట్టు కథలను, అపోహలను సృష్టించి ఈ దివ్య నామముల యొక్క నిజమైన అర్థమును మరుగు పరచి ప్రజలను తప్పుద్రోవ పట్టించారు. మనము ఒకవిషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి, ఆలోచించాలి. పురాణాలలో, కథలలో చెప్తున్న దివ్యమైన పరమేశ్వరుని నామములు వేదములో ఉన్నాయి. కానీ పూజావిధానాలు, ఆరాధనా పద్ధతులు, కొన్ని మంత్రాలు ఏవీ కూడా వేదములో ఉండవు. ఉదాహరణకు ప్రస్తుతం అందుబాటులో ఉన్న కొన్ని లక్ష్మి మహామంత్రాలు, బీజాక్షర సహిత మంత్రాలు ఏవీ కూడా వేదములో కనిపించవు. ఎందుకంటే వేదములోని పేర్లకు తమ ఊహలను జోడించి ఇష్టం వచ్చినట్టు కల్పించిన ఆరాధనలు ఇవి. అటువంటి కొన్ని అపోహల గురించి, కట్టు కథల గురించి ఈ సంపాదకీయములో వివరముగా పరిశీలిద్దాము. ముందుగా సరస్వతి అనే నామము గురించి తెలుసుకుందాం.

చాలామంది చరిత్రకారులు సరస్వతి ఆరాధన అనేది వేద కాలం తర్వాతే ప్రారంభమయిందని చెప్పారు. పురాణ, ఇతిహాసాలలో సరస్వతికి నవశక్తి రూపాలు ఆపాదించారు. ఇవి బ్రహ్మి, వైష్ణవి, మహేశ్వరి, కౌమారి, వారాహి, నర్సింహి, ఐంద్రి, శివధూతి, చాముండ. సరస్వతిని మహాసరస్వతి అని కూడా పిలుస్తారు. నీలసరస్వతి అనేది సరస్వతి యొక్క ఉగ్రరూపంగా చెప్తారు. ఈ అవతారాలు, అంశలు, వీటి చుట్టు అల్లుకున్న కథలు అన్నీ కూడా ఒకేసారి వచ్చినవి కాదు, కాలక్రమంలో ఒకదాని తర్వాత మరొకటి పుట్టుకొచ్చినవని, వేదములో తెలిపిన పరమేశ్వర నామములలోంచి కొన్నింటిని తీసుకుని వాటి చుట్టు కథలు అల్లారని మనం గ్రహించాలి. అట్లాంటి వాటిలో కొన్నింటిని పరిశీలిద్దాం.

బ్రహ్మ సృష్టి చేయాలని అనుకున్నప్పుడు సరస్వతిని పుట్టించాడట. ఆమె అమితమైన సౌందర్యరాశి అట. ఆమె అందం చూసి విచలితుడైన బ్రహ్మ ఆమె ఎటువైపు వెళ్తే అటు వైపే చూస్తు, ఆమె వెంట పడ్డాడట. ఆ సమయములో బ్రహ్మకు నాలుగు వైపుల నాలుగు మరియు పైన వైపు ఐదో తల వచ్చాయట. చివరికి సరస్వతి శివుడిని శరణు వేడుగా, శివుడు క్రోధంతో బ్రహ్మను ఆపి అతనికి తలపై మొలిచిన ఐదో తలను ఖండించాడట, అలా ఖండించాక బ్రహ్మ తన తప్పు తెలుసుకున్నాడట. బ్రహ్మ సరస్వతి వెంటపడ్డ సమయములో ఆమె వివిధ రకాల జంతువులు మరియు పక్షుల రూపాలలో పరిగెత్తిందని, అప్పుడు బ్రహ్మ అవే జాతులకు చెందిన మగ రూపంలో ఆమె వెంట పడ్డాడని, సృష్టిలోని ప్రతి జీవి యొక్క ఆవిర్భావం అలా జరిగిందని కూడా చెప్తారు. బ్రహ్మ, సరస్వతి రెండూ కూడా అత్యంత ఉన్నతమైన అర్థమును కలిగి ఉన్న పరమేశ్వర నామములే. పరమేశ్వరుడు అత్యంత శక్తిశాలి, లింగాలకు అతీతుడని వేదములో స్పష్టముగా చెప్పబడింది. అయినప్పటికి ఆయన యొక్క నామమును ఒక ఆడదేవతగా, మరొక మగదేవత వెంట బడుతుంటే తనను తాను కాపాడుకోలేని అసహాయిలా చిత్రీకరించారు. పైగా దానివల్లనే వివిధ జాతులు పుట్టాయని అసంబద్ధమైన కట్టుకథలు రాసారు.

మరొక కథలో ఒకసారి బ్రహ్మ యజ్ఞం చేద్దామనుకుని అన్ని ఏర్పాట్లు చేసుకుని సరస్వతి కోసం ఎదురు చూస్తు ఉంటాడట. అప్పుడు సరస్వతి యజ్ఞ సమయానికి రాలేనని, తనకు ఇంటి పనులు ఇంకా అవలేదని కబురు చేస్తుందట. దానితో బ్రహ్మ మరొక స్త్రీని వివాహమాడి యజ్ఞాన్ని చేయాలని నిర్ణయించుకొని ఇంద్రుడిని పురమాయించగా ఇంద్రుడు గాయత్రి అనే పేరు గల ఒక పాలమ్మాయిని తీసుకొచ్చి బ్రహ్మకిచ్చి వివాహం చేయగా, బ్రహ్మ యజ్ఞాన్ని ప్రారంభించాడట. అయితే సరిగ్గా యజ్ఞసమయానికి సరస్వతి వచ్చి జరిగినదంతా చూసి కోపంతో అక్కడ సభలో ఉన్న మగవాళ్ళకి, వారి భార్యలకు వరుసగా శాపాలు పెడుతుందట. పరమేశ్వరుడు అనంత శక్తిశాలి, మహామహిమాన్వితుడు, ఆయన కంటే ఉన్నతులు, గొప్పవారు ఎవరూ ఉండరు. మరి అటువంటప్పుడు ఉక్రోషముతో శాపములు పెట్టవలసిన అవసరము ఉంటుందా? ఇవేకాదు ఇటువంటి కట్టుకథలు సరస్వతి పేరుతో చాలా ఉన్నాయి. మచ్చుకి కొన్ని మాత్రమే మనం పరిశీలించాం.

ఇప్పుడు లక్ష్మి అనే పేరును పరిశీలిద్దాం. ఈ పేరుకు గల వైదిక అర్థములను ముందుగానే వివరించాము. లక్ష్మి అను పేరుకు సంబంధించిన వేదవిరుద్ధమైన కథలు, పురాణాలు ఎక్కువగా మహాభారతం తర్వాతే వచ్చాయని చరిత్రకారుల అభిప్రాయం. ఈ పుస్తకాల ప్రకారం లక్ష్మిని అష్టలక్ష్ములుగా విభజించారు. అవి వరుసగా ఆదిలక్ష్మి, ధాన్యలక్ష్మి, ధైర్యలక్ష్మి, గజలక్ష్మి, శంతనలక్ష్మి, విజయలక్ష్మి, విద్యాలక్ష్మి మరియు ధనలక్ష్మి. లక్ష్మి దేవిని కొన్ని పురాణాల ప్రకారం భృగుమహర్షి కూతురని, తపస్సు చేసి విష్ణువును భర్తగా పొందిందని చెప్తారు. కొంతమంది లక్ష్మి శివుని చెల్లెలని చెప్తారు. విష్ణువుకు తన కార్యాలన్ని చక్కబెట్టుకోవటానికి లక్ష్మి సహాయం ఎంతో అవసరం

ఉంటుందట. ఆవిడ లేకపోతే విష్ణువు నిరుపేద అవుతాడట. అందుకని విష్ణువంతటివాడికే తప్పలేదు కాబట్టి మనుషులందరు కూడా ధనం కోసం ఆమెనే పూజించాలని చెప్తారు. కానీ వాస్తవానికి పరమేశ్వరుడు సకలైశ్వర్య సంపదలకు అధిపతి. లక్ష్మి, విష్ణువు రెండూ ఆయన నామములే. సమస్త సృష్టికి ఆయనే అధిపతి, స్వామి, యజమాని. తన కార్యాలను నిర్వహించడానికి మరొకరి సహాయం ఆయనకు ఎంతమాత్రం అవసరం లేదు.

మరొక కథనం ప్రకారం. సరస్వతి, లక్ష్మి బ్రహ్మ మెదడు నుంచి పుట్టారట. అందువలన వాళ్ళిద్దరు అక్కాచెల్లెళ్ళు అవుతారట. తరువాత కాలంలో విష్ణువుకి, లక్ష్మికి వివాహం జరుగుతున్నప్పుడు సరదాగా లక్ష్మి, సరస్వతి ఒకే విధంగా తయారయ్యి విష్ణువు ముందుకి వస్తే విష్ణువు వారిద్దరిలో లక్ష్మి ఎవరో గుర్తుపట్టలేక సరస్వతిని తన భార్యగా అనుకొని వివాహంలోని కొన్ని కార్యక్రమాలను సరస్వతితో చేస్తాడట. అందుకని విష్ణుకి సరస్వతి సగం భార్య అవుతుందట. కానీ సరస్వతికి తన చెల్లెలి జీవితం ఇబ్బంది పాలు చేయడం ఇష్టం లేక అక్కడి నుంచి వెళ్ళిపోతుందట. కొన్ని కథలలో విష్ణువుకి సరస్వతి, పార్వతి, లక్ష్మి ముగ్గురు భార్యలని, కాలక్రమంలో విష్ణువు ముగ్గురు భార్యలు వద్దనుకొని లక్ష్మిని మాత్రం తన భార్యగా ఉంచుకొని మిగిలిన ఇద్దరిలో ఒకరిని బ్రహ్మకు, మరొకరిని శివుడికి ఇచ్చాడని చెప్తారు. ఏమాత్రం నైతికత లేని ఇటువంటి కథల వలన క్రమముగా మనుషులకు భగవంతుడంటే గౌరవం, ఆయనను గురించి తెలుసుకోవాలనే తపన పోతున్నాయి.

స్కంద మరియు భాగవత పురాణాలలో మరొక కథ కూడా ఉంది. ఒకసారి లక్ష్మి, సరస్వతి, పార్వతి ఒక మాయా అద్దాన్ని సృష్టిస్తారట. అది ప్రపంచంలో ఉన్నవన్నీ ఉన్నట్టుగా చూపిస్తుందట. ఆ అద్దాన్ని వాళ్ళు ప్రపంచం లోకెల్లా ఉత్తమమైన పతివ్రత ఎవరు అని అడిగినప్పుడు ఆ అద్దం అనసూయను చూపిస్తుందట. అనసూయ అత్రి మహాముని భార్య అట. అప్పుడు వాళ్ళకు,"పతివ్రత అంటే త్రిశక్తులమైన మాలో ఒకళ్ళు కావాలి కానీ, ఒక మనిషి అవడమేంటి" అని కోపం వస్తుందట. వాళ్ళు వాళ్ళ భర్తలను పిలిచి వెంటనే వెళ్ళి ఆవిడ పాతివ్రత్యాన్ని భంగపరచమని చెప్తారట. అప్పుడు త్రిమూర్తులు అత్రి మహాముని లేని సమయములో బ్రహ్మచారులుగా అనసూయ దగ్గరికి వెళ్ళి భోజనం పెట్టమని అడుగుతారట. అనసూయ అందుకు అంగీకరించగా, వాళ్ళు "మేము బ్రహ్మచారులం, మాకు ఒక నియమం ఉంది, దిగబరంగా వడ్డించాలి" అని చెప్తారట. దానితో ముందు భయపడినా తరువాత ఒప్పుకున్న అనసూయ తన పాతివ్రత్య మహిమతో వారి ముగ్గురిని పసిపిల్లలుగా మార్చి వారి ఆకలి తీరుస్తుందట. భర్తలు ఎంతకీ రాకపోయేసరికి ఏమైందో చూద్దామని వచ్చిన త్రిశక్తులకి వారి భర్తలు పసిపిల్లలుగా కనిపించేసరికి అనసూయ కాళ్ళ మీద పడి క్షమించమని వేడుకుంటే ఆవిడ మళ్ళీ త్రిమూర్తులకు మామూలు రూపాలు ఇస్తుందట. ఆ తరువాత త్రిమూర్తులు వారి ముగ్గురి అంశతో దత్తాత్రేయుడు పుడతాడని అనసూయకి వరమిస్తారట. అందుకే అతనికి మూడు తలలుంటాయని చెప్తారు. ఇట్లాంటి కథలు భారతదేశ ఆధ్యాత్మిక పుస్తకాలలో కోకొల్లలు.

ఈ కథలలో చెప్పబడిన బ్రహ్మ, సరస్వతి, విష్ణు, లక్ష్మి ఇత్యాదులన్నీ అద్వితీయుడైన పరమేశ్వరుని నామములేనని మరువరాదు. బ్రహ్మధర్మము (వైదిక నియమావళి) ద్వారా మనుషులు నియమబద్ధముగా ఎలా జీవించాలో మార్గదర్శనం చేసిన పరమేశ్వరుడు ఈ కట్టుకథలలో రాసుకున్నట్లు అనైతికమైన, అరిషడ్వర్గ ప్రేరేపితమైన పనులు ఎలా చేస్తాడు??? కేవలం మనుషులను భ్రమింప చేసి, పరమేశ్వరుని తలవగానే ఈ పిచ్చి కథలు గుర్తుకొచ్చేలా రాసారు. ఈ కథలను సరిగా గమనిస్తే పరమేశ్వరుడు ఇన్నిలోపాలను కలిగి ఉంటాడా, ఇంతటి అశక్తుడా అని అనిపించకుండా ఉండదు.....

కాబట్టి ఎల్లరు సమస్త విశ్వము కంటే గొప్పవాడు, పెద్దవాడు అయిన పరమేశ్వరుని నామములకు అరిషడ్వర్గ పూరితములు, నీతిబాహ్యములు అయిన లక్షణాలను ఆపాదించి, అసభ్యకరమైన కథలను కల్పించారని అర్థం చేసుకొని వేదవిహితముగా పరమేశ్వర నామములను తెలుసుకొని ఉపాసిస్తూ జన్మలను సార్థకము చేసుకోవాలి.

**స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరం**
**శుద్ధమపాపవిద్ధమ్ ।... (యజు:-40-08)**

**తాత్పర్యము:** "పరమేశ్వరుడు సర్వశక్తిశాలి, శీఘ్రకారి (అత్యంత వేగము గలవాడు) మరియు సర్వత్ర విద్యమానుడు. ఆయన స్థూల, సూక్ష్మ శరీరములు లేనివాడు. నాడీ కండరాది సంబంధ స్నాయువులేవియు (తంతువులు) లేనివాడు. స్వయంజాతుడగు పరమేశ్వరుడు మాతా, పిత, కళత్రాది సంబంధములకు అతీతుడు. ఆయన జీవుల వలె ఛిద్రములు గాని, గాయములు గాని, లోపములు గాని లేనట్టి అశరీరి, శాశ్వతుడు, పాపకళంక రహితుడు మరియు అత్యంత పరిశుద్ధుడు."

# సృష్టికర్తతో సంభాషణ

– స్వేచ్ఛానువాదం : డా.జ్యోత్స్నా ఇలియాస్

ప్రశ్న:– అయితే నాకు నాశనం లేదా...?

జవాబు:– నిన్ను నువ్వు అంతం చేసుకోలేవు. నీ అసలు స్వరూపాన్ని, నీ సత్తాను, నీవు అర్థం చేసుకోలేక పోవచ్చునేమోగాని, నీవు లేకపోవడం అన్నది జరుగదు. సగం తెలిసి, సగం తెలియక, సందిగ్ధంలోపడి కొనసాగవచ్చు.

ప్రశ్న:– అయ్యో, అదొక పెద్ద శిక్ష... నరకం...

జవాబు:– అక్షరసత్యం... అలా జరిగినా, నిన్ను నేను దండించను; హెచ్చరించను... ఆస్థితి ఎంతోకాలం కొనసాగేదికాదు. ఆ సంధిగ్ధస్థితి శాశ్వతం కాదు. ఆ నరకం నుంచి ఒక్కసారి బయట పడగలిగితే చాలు... సంశయం నుంచి బయటికి వస్తే – వాస్తవం తెలిసినట్టేగా! తెలుసుకోలేకపోవడం అనే స్థితి నుంచి నీవు బయటికి రాగలిగితే – నీవు తెలుసుకున్నట్టేకదా!

అలా బయటికి వచ్చేందుకు అనేక మార్గాలున్నాయి. కొలమానాలు, పరిధులు, స్థాయిలు ఉన్నాయి. ప్రస్తుతం నీవు అటువంటి ఒకానొక స్థాయిలో, దశలో ఉన్నావు.

ప్రశ్న:– ఇంకా మరికొన్ని దశలున్నాయంటావా?

జవాబు:– నా రాజ్యంలో ఎన్నెన్నో సౌధాలు ఉన్నాయని నేను చెప్పానుగా? అవి లేకుంటే నేను ఉన్నాయని చెప్పానా?

ప్రశ్న:– ఈ వివిధ దశల ఆంతర్యం ఏమిటి?

జవాబు:– నీకు తెలిసిన దానినే నీవు గుర్తిస్తావు.... నీ 'ఎరుక' లోనికి రాని దానిని నీవు గ్రహించలేవు; నీ సత్తా ఏమిటో నిజంగా నీకు తెలిసి ఉండకపోతే అసలు నీవే ఉండేవాడివి కావు. నీవు ఉన్నావు అంటే – నీ సత్తాని, లక్ష్యాన్ని నీవు గుర్తించావన్నమాట – దానిని నీవు మరిచిపోయి ఉండవచ్చు... నీవు విస్మరించిన నీ లక్ష్యాన్ని నీకు గుర్తు చేయడం కోసమే నీకు ఈ జన్మ లభించింది. నీ వికాసం కోసం, నిన్ను నీవు గుర్తించు కోవడం కోసమే పలు రకాల పరిస్థితులను, అనుభవాలను నీకై ఏర్పాటు చేయబడ్డాయి, వాటి ద్వారా ఆత్మవికాసం పొంది చివరికి నీ లక్ష్యాం తెలుసు కోగలవు తరువాత, నీ జిజ్ఞాస పెరుగుతుంది. మరింత తెలుసు కోవాలన్న అభీప్స (అభిలాష) నీలో తలఎత్తుతుంది. ఎంత తెలుసుకున్న ఇంకా పూర్తిగా నీవు తెలుసుకోలేదని నీకు అనిపిస్తుంది... దానిని తెలుసుకోవాలన్న ప్రయాసలో మరికొన్ని అనుభవాలను, సంఘటనల వలన నీ పరిధిని మరింత పెరుగుతుంది. అదే, జీవన వలయం! ఈ వలయం విశాలమవుతున్నకొద్దీ నీలో ఆత్మవికాసం కూడా పెంపొందుతుంటుంది... నీవు విస్మరించినవన్నీ నీకు జ్ఞాపకం వస్తుంటాయి. నీ నిజమైన స్వభావ స్వరూపాలు, నీ నిజమైన లక్షణాలు నీకు అర్థమవుతాయి. ఇదంతా అవధులు లేక, హద్దులు, సరిహద్దులు లేని ఒక నిరంతర పయనం... ఈ వికాసానికి అంతూ, దరీ ఉండవు....

ప్రశ్న:– ఈ ప్రయత్నంలో, అదే, ఈ ప్రయాణంలో నేను కోరుకున్న గమ్యాన్ని చేరుకుంటానా? అనుకున్నవన్నీ సాధించగలనా?...

జవాబు:– నిశ్చయం... నీకు విజయం తథ్యం...

ప్రశ్న:– అంటే, నేను, నీకు చేరువకాగలనా?

జవాబు:– సమాధానం నీవే చెప్పు... కాగలవా?

ప్రశ్న:– ఏమో... నాకు తెలియదు.

జవాబు:– తెలియదు అంటే కుదరదు. తెలియకుంటే, తెలుసుకో. నీకు లోగడ చెప్పాను. గుర్తుందా? – ఆత్మ – బుద్ధి – దేహం లేదా అభీప్స – ఆలోచన – ఆచరణ... జ్ఞాపకం తెచ్చుకో... ఈ త్రయాన్ని ఎన్నటికీ విస్మరించకు... మరొసారి నీకు గుర్తుచేస్తున్నాను.... కానీ నీ స్వయం సామర్థ్యాన్ని నీవు మరచిపోయి, నిన్ను నీవే పరిమితం చేసుకుంటున్నావు. తెరమరుగైన ఆ జ్ఞాపకాలను వెలుగులోకి తీసుకురా! నిన్ను నీవు గుర్తించు...

నేను చెప్పిన ఈ విషయాలను గురించి ఆలోచించు... మనం మళ్ళీ కలుద్దాం.

– నీల్ డోనాల్డ్ వాల్ష్ – ఆంగ్ల రచన
– "కన్వర్ సేషన్స్ విత్ గాడ్"
– సశేషము

✦

మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్ బ్రహ్మధర్మ ఆచార్యులు. ఆయన ఉన్నతమైన విలువలు, ఉత్తమమైన ఆధ్యాత్మిక భావనలు కలిగిన మహనీయులు. భగవంతుని తత్వములను, నియమములను చక్కగా అర్థము చేసుకొని ఆచరించిన పరమయోగీంద్రులు. శ్రీ దేవేంద్రనాథ్ రచించిన అమూల్యమైన గ్రంథరాజము "బ్రాహ్మధర్మము". దీనిలో దాదాపుగా మూడు వందల వేద, ఉపనిషత్ మంత్రములు గలవు. ప్రథమ ఖండములోని పదునాలుగు అధ్యాయములు ఆధ్యాత్మిక విషయములను తెలుపగా, చివరి రెండు అధ్యాయములు నైతిక విలువల గురించి తెలుపును. ధర్మజీవనము యొక్క ప్రాముఖ్యతను ప్రశంసించుచు, ధర్మజీవనమును ఎన్నడు పరిత్యజించరాదని హెచ్చరించును. ధర్మమొక్కటే ఎప్పటికి విడువని ఆత్మబంధువని కావున మనిషి తనకు తాను సహాయము చేసుకొనుట కొరకు మరియు పరులను ఉద్ధరించుట కొరకు ధర్మమును ఆచరింపవలెనని ప్రబోధించును. ఈ గ్రంథము యొక్క తెలుగు అనువాదమును ప్రచురించుచున్నాము.

# బ్రాహ్మధర్మము

## ప్రథమ ఖండము - నాల్గవ అధ్యాయము

**- మహర్షి దేవేంద్రనాథ్ ఠాగూర్**

**గత సంచిక తరువాయి భాగం....**

**1. మూలము (శ్లోకము:)**

**యది మన్యసే సువేదేతి దభ్రమేవాపి నూనం త్వం వేత్థ బ్రహ్మణోరూపమ్. (కేన - 2. ఖం. 1 - వా.)**

**ప్రతి పదార్థము:** సువేద ఇతి = చక్కగా తెలుసుకున్నానని, యది మన్యసే = ఏదైతే అనుకున్నావో, బ్రహ్మణః రూపమ్ = పరమేశ్వరుడిని గురించి, నూనం = నిశ్చయముగా, దభ్రమే వాపి = స్వల్పముగానే, త్వం వేత్థ = నీవు తెలుసుకొనుచున్నావు.

**తాత్పర్యము:** పరమేశ్వరుడిని గురించి చక్కగా తెలుసుకున్నానని ఏదైతే నీవు అనుకున్నావో పరమేశ్వరుని గురించి అది నిశ్చయముగా స్వల్పముగానే నీవు తెలుసుకొనుచున్నావు అని గ్రహించుము.

**వ్యాఖ్యానము:** ఎవ్వరైతే పరమేశ్వరుడిని గురించి తాను పూర్తిగా తెలుసుకున్నానని అనుకుంటున్నారో వారు పరమేశ్వరుడిని గూర్చి అతి తక్కువగానే తెలుసుకున్నారని లేదా అసలు తెలుసుకోలేదని అర్థం చేసుకోవాలి. ఎందుకనగా, పరమేశ్వరుడు అవ్యక్తుడు, అనంతుడు ఆయనను గురించి పూర్తిగా ఎవరు, ఎప్పటికి తెలుసుకోలేరు అనే విషయమును అతడు గ్రహించలేదు. అతనికి పరమేశ్వరుడిని గురించి సరి అయిన జ్ఞానము లేకపోవుట వలన, అవగాహన లేకపోవుట వలన తనకు కనిపించిన లేదా తన మనసుకు నచ్చిన ఏదో ఒక "పదార్థమును" లేదా "నాశనమైపోయే వస్తువును" లేదా "ఏదో ఒక రోజు ఖచ్చితముగా మరణించవలసిన మనిషిని" పరమేశ్వరుడని అనుకుంటున్నాడు. తాను పొందగలిగిన వస్తువులను పరమేశ్వరుడని అనుకోవటం వలన అతను తాను పరమేశ్వరుడిని పూర్తిగా తెలుసుకున్నానని భ్రమపడుతున్నాడు.

పరమేశ్వరుడు సమస్త విశ్వమునకు సృష్టికర్త, అధిపతి. మనిషి ఈ రోజు వరకు ఈ విశ్వము ఎంత పెద్దదో, ఎన్ని నక్షత్ర, గ్రహమండలాలను, కలిగి ఉందో పూర్తిగా తెలుసుకోలేకపోయాడు. అంటే ఈశ్వరుడి సృష్టిలో భాగమైన విశ్వం గురించే తెలుసుకోలేనివాడు దాని సృష్టికర్త గురించి ఎలా తెలుసుకోగలుగుతాడు?? అందుకే ఈ శ్లోకంలో చాలా స్పష్టంగా ఎవరైనా తనకు పరమేశ్వరుడి గురించి పూర్తిగా తెలుసు అని అనుకుంటే అది కేవలం వారి అజ్ఞానం అవుతుందని, వాస్తవానికి వారికి పరమేశ్వరుడి గురించి అసలు ఏమీ తెలియదని మిగిలిన వారు గ్రహించాలని బోధిస్తున్నారు.

**వివరణ:** నాశనమైపోయే లేదా కాలప్రభావానికి లోనయ్యే పదార్థాలను లేదా ప్రాణులను పరమేశ్వరుడిగా భావించిన వారు పరమేశ్వరుడి గురించి తమకు నచ్చిన విధంగా, తమ ఊహలకు అనుగుణంగా చిత్రీకరిస్తారు. అంటే పరమేశ్వరుడికి అరిషడ్వర్గాలు ఉంటాయని, ఆయన పొగడ్తలకు లొంగిపోతాడని, పక్షపాతము వంటి బలహీనతలు కలిగి ఉంటాడని మొదలైన విషయములను పరమేశ్వరుడికి ఆపాదిస్తారు. తదనుగుణంగా పుస్తకాలు రచిస్తారు. కానీ ప్రతి మనిషికి పరమేశ్వరుడు బుద్ధిని, మంచి-చెడు తెలుసుకునే విచక్షణను ఇచ్చాడు. ఇటువంటి కథలు చదివి నమ్మే ముందు ఒక్క క్షణం పరమేశ్వరుడు అనంత శక్తిశాలి, ఐశ్వర్యశాలి, సృష్టికర్త కదా! ఆయనకు ఇటువంటి బలహీనతలు ఉంటాయా? ఆయన కాలమునకు లోబడి మరణిస్తాడా? లేదా ఒక నశించిపోయే పదార్థము లేదా వస్తువు ఆయనకు

ఎలా ప్రాతినిధ్యం వహిస్తుంది?? మొదలైన ప్రశ్నలు మనుషులందరు తమకు తాము వేసుకోవాలనే తపనతో మహర్షి గారు ఈ మంత్రాన్ని చేర్చి ఉంటారు.

ఈ వాక్యము మంత్రములోని ప్రథమ వాక్యములో మొదటి సగభాగము మాత్రమే. మునుపటి అధ్యాయములలో మనుషులు బ్రహ్మజ్ఞానమును పొందుటలో గల కష్టములను వివరించిన ఋషీశ్వరుడు ఈ వాక్యములో పరమేశ్వరుడిని ఎవరు, ఎప్పటికి పూర్తిగా తెలుసుకోలేరని చెప్పుచున్నాడు. ఆ విధముగా గ్రహించుట ద్వారా పరమేశ్వరుడి గురించి కొంత తెలుసుకున్నట్టు అవుతుందని, బ్రహ్మజ్ఞానాన్ని అర్జించటం ద్వారా, వేదాన్ని అధ్యయనం చేయటం ద్వారా మరి కొంత తెలుసుకొనవచ్చని వేదముల యందు కూడా స్పష్టంగా చెప్పబడింది.

**2. మూలము (శ్లోకము:)**

**నాహం మన్యే సువేదేతి నోనవేదేతి వేదచ**
**యోనస్తద్వేద తద్వేద నోనవేదేతి వేద చ**

**(కేన. 2 - ఖం. 2 - వా.)**

**ప్రతి పదార్థము:** సువేద ఇతి = (పరమేశ్వరుడిని) చక్కగా తెలుసుకొన్నానని, అహం = నేను, న మన్యే = తలచలేదు, తత్ = అట్టి (పరమేశ్వరుడిని) గురించి న వేద ఇతి = తెలియనిదనిగాని, వేదచ = తెలిసినదనిగాని, నో = నేను తలచను, నః = మనలో (మనుషులలో), యః = ఎవ్వరైతే, నో న వేద చ = తెలిసినదని కాని, తెలియనిది అని కాని, వేదచ = తెలుసుకొనెదరో, సః = వారు, తత్ = దానిని (పరమేశ్వరుడిని), వేద = సరి అయిన విధముగా తెలుసుకొనుచున్నారు.

**తాత్పర్యము:** పరమేశ్వరుడిని చక్కగా తెలుసుకొన్నానని నేను తలచలేదు. పరమేశ్వరుడు తెలియనిదనిగాని, తెలిసినదనిగాని నేను తలచను. ఎవరైతే పరమేశ్వరుడు తెలిసినదని కాని, తెలియనది అని కాని ఎవరూ చెప్పలేరని, నిర్వచించలేరనే వాస్తవమును తెలుసుకొనెదరో వారు పరమేశ్వరుడిని సరి అయిన విధముగా కొంత తెలుసుకొనుచున్నారని గ్రహించవలెను. (ఇక్కడ నేను అనగా ఋషి అని గ్రహించవలెను).

**వ్యాఖ్యానము:** ఒక బ్రహ్మజ్ఞాని "నేను పరమేశ్వరుడిని తెలుసుకొన్న వాడిని కాను" అని చెప్పినచో ఆ వాక్యమునకు అర్థము అతను పరమేశ్వరుడి గూర్చి ఏమీ తెలియనివాడని కాదు. అతడు పరమేశ్వరుడు "అవ్యక్తుడని" అనగా సృష్టిలో ఎవరూ, ఏవిధముగా కూడా ఆయనను వ్యక్తము చేయలేరని, ఆయనను గూర్చి చెప్పలేరనే వాస్తవ జ్ఞానమును కలిగి ఉన్నాడు. ఈ విధముగా పరమేశ్వరుడిని గ్రహించుటయే నిజమైన జ్ఞానమని తెలుసుకున్నాడని అర్థము చేసుకొనవలెను.

**వివరణ:** ఈ వాక్యములో అజ్ఞానుల సందేహమునకు సరి అయిన సమాధానము కలదు. అనంతుడైన పరమేశ్వరుడిని మనుషులు ఎప్పటికి పూర్తిగా తెలుసుకోలేరనేది నిశ్చయము. అయితే ఆయన గురించి మనుషులు అసలు ఏమీ తెలుసుకోలేరు అని దాని అర్థం కాదు. ఈశ్వరుడు కేవలం ఒకే ఒక్కడు, ఈ సమస్త విశ్వమునకు ఆయనే సృష్టికర్త, సృష్టిలోని ఏ పదార్థమును కూడా భగవంతుడని భావింపరాదు అనే విషయమును మనిషి తన ఆలోచన మరియు వేద విజ్ఞానము, బ్రహ్మజ్ఞానుల ఉపదేశలముల ద్వారా తెలుసుకొనగలుగుతాడు. తన యొక్క ఇహపరముల సార్థకత కొరకు కేవలం పరమేశ్వరుడినే ఉపాసిస్తాడు.

అయితే కొంతమంది "పరమేశ్వరుడు అవ్యక్తుడు, ఆయనను మనము తెలుసుకోలేము కాబట్టి తెలుసుకోగలిగే ప్రాణులను పరమేశ్వరునిగా ఉపాసిస్తాము" అని చెప్తున్న సాకులు, కథలు, తప్పులని, వేదబాహ్యములని గ్రహించవలెను.

**3. మూలము (శ్లోకము:)**

**యస్యామతం తస్యమతం మతం యస్య న వేద సః**
**అవిజ్ఞాతం విజానతాం విజ్ఞాత మవిజానతామ్.**

**(కేన. 2 - ఖం. 3 - వా.)**

**ప్రతి పదార్థము:** యస్య = ఎవరికి, అమతం = (పరమేశ్వరుడు) తెలియదో, తస్య = వారికి, మతం = తెలిసినది (పరమేశ్వరుడు); యస్య = ఎవరికి, మతం = (పరమేశ్వరుడు) తెలియబడినదో, సః = అతడు, న వేద = తెలిసికొనలేదు; విజానతాం = విశేషముగా తెలిసినవానికి, అవిజ్ఞాతం = తెలియబడనిదే, అవిజానతాం = తెలియనివానికి, విజ్ఞాతం = విశేషముగా తెలియబడినది.

**తాత్పర్యము:** 'నేను పరమేశ్వరుడిని తెలుసుకొనలేదని' ఎవరు భావించునో అట్టివారు నిజముగా పరమేశ్వరుడిని గురించి కొంత తెలుసుకున్నవారు. ఇక 'నేను పరమేశ్వరుడిని పూర్తిగా తెలుసుకున్నానని' ఎవరు భావించెదరో అట్టివారు నిజముగా పరమేశ్వరుడిని తెలుసుకున్నవారు కారు.

**వ్యాఖ్యానము:** మనిషి తన పరిమిత బుద్ధిచే పరమేశ్వరుడిని గురించి పూర్తిగా ఎప్పటికీ తెలుసుకొనలేడు. అందుకే ఉత్తమమైన బ్రహ్మజ్ఞాని తాను పరమేశ్వరుడిని తెలుసుకొనలేదని భావించును. మూర్ఖుడు, అతితెలివికలవాడు తాను పరమేశ్వరుడిని తెలుసుకున్నానని గొప్పలు పోయి అహంకరించును.

**వివరణ:** ఇది వెనుకటి వాక్యములోని భావమును ధ్రువపరచుచున్నది. అల్పజ్ఞులు తాము బ్రహ్మమును పూర్తిగా తెలుసుకున్నామని చెప్పుదురు. కాని జ్ఞానులగువారు వినయముగా తాము పొందిన బ్రహ్మజ్ఞానము అత్యల్పమయినదని, అది ఎక్కువ జ్ఞానము క్రింద గణింపదగినది కాదని చెప్పుదురు. **- సశేషం** ✦

---

శ్రీ స్వామి దయానంద సరస్వతి వేదవేదాంగ పండితులు. ఆయన బాల్యమునందే తన జన్మను ఏ విధంగా సార్థకము చేసుకొనవలెననే విషయము గురించి పరిపరి విధములుగా ఆలోచిస్తూ ఉండేవారు. ఈ క్రమంలో ఆయన అనేక గ్రంథములను అధ్యయనం చేసి తుదకు వేదములే సత్యములని, మార్గదర్శకములని తెలుసుకొన్నారు. వేదములను అభ్యసించవలెననే అభిలాషతో ఎన్నో కష్టనష్టములకు ఓర్చి, ఎన్నో ప్రదేశములు సంచరించి వేదములు మరియు వేదాంగముల యందు చక్కటి పాండిత్యమును సొంతం చేసుకున్నారు. వేదాంగములకు చక్కటి వివరణను 16 భాగాలలో సమగ్రంగా రచించారు. ప్రజలలోని మూఢనమ్మకములను, వేదముల పట్ల, భగవంతుని పట్ల ఉన్న అపోహలను తొలగించుచు, వైదిక ధర్మమును, వేదములను బోధించుచు తన జీవన పర్యంతము అనేక ప్రాంతములలో సంచరించారు. ఈ క్రమములో ఆయన 60 కి పైగా పుస్తకాలను రచించారు. ఋగ్, యజుర్వేదములకు భాష్యభూమికలు రచించారు. ఆయన రచనలలో ప్రముఖమైనది సత్యార్థప్రకాశము. ఈ గ్రంథము నుండి ప్రచురింపబడుచున్న క్రింది వ్యాసంలో ఆయన ఏది ధర్మమో, ఏది అధర్మమో వివరించారు. అయితే కొందరు స్వార్థపరులు ధర్మాధర్మముల గురించి తెలిసి కూడా కావాలని తమ జీవనోపాధి కొరకు, డబ్బు, అధికారము కొరకు అధర్మ పద్ధతులను బోధిస్తూ ప్రజలను మోసగించుచున్నారని తెలిపారు.

# మూర్తిపూజ

**సత్యార్థ ప్రకాశము, ఏకాదశ సముల్లాసము**
**- స్వామి దయానంద సరస్వతి**

**గత సంచిక తరువాయి భాగం....**

ప్రశ్న:- మీరు అన్నింటిని ఖండనముచేస్తూ వస్తున్నారు. కాని తమ తమ ధర్మములందు అవి అన్ని మంచివే. ఏ మతమును ఖండన చేయకూడదు. ఒక వేళ చేసినచో! మీరు వారికంటె అధికముగా ఏమి చెప్పబోవుచున్నారు? మరి అలా చెప్పుచున్నారంటే మీ కంటె అధికుడుగాని, మీతో సమానుడుగాని ఇప్పటి వరకు లేడా? ఇలా అభిమానపడడం మీకు సరైనది కాదు. ఎలా అనగా పరమాత్ముని సృష్టియందు ఒకనికంటె ఒకడు అధికుడుగానూ, ఒకనితో ఒకడు సమానుడుగానూ, ఒకనికంటె ఒకడు తక్కువగానూ ఎందరోగలరు. ఎవ్వరికిని గర్వపడుట సమంజసం కాదు.

ఉత్తరము:- అందరికి ధర్మము ఒక్కటేనా? లేక వేరు వేరుగా ఉండునా! వేరు వేరుగా ఉండును అన్నచో, ఒకదానితో ఒకటి విరుద్ధముగా ఉండునా, అవిరుద్ధముగా ఉండునా? విరుద్ధముగా ఉండును అన్నచో ఒకటిమాత్రమే తప్ప, మరొకటి ధర్మము కాజాలదు. అవిరుద్ధముగా ఉండును అన్నచో ఇక వేరువేరుగానుండుట అనవసరము, కావున ధర్మముకాని, అధర్మముకాని ఒక్కొక్కటే ఉండునుగాని అనేకమైయుండవు.

మేము చెప్పునట్టి విశేషమేమనగా ఒక రాజు సమస్త సంప్రదాయములలోని ఉపదేశకులను అందరిని ఒక్కచోట చేర్చినచో ఆ సంప్రదాయములు వేయింటికంటె తక్కువగా ఉండవు. కాని వీనియందు పౌరాణిక, క్రైస్తవ, జైన, మహమ్మదీయములు అను నాలుగే ముఖ్యవిభాగములు కలవు. ఈ నాలుగింటిలోనే సమస్త సంప్రదాయము కలిసి ఉండవచ్చును.

ఒకానొక రాజు సంప్రదాయముల వారిని అందరిని పిలిపించి సభచేసి, తాను జిజ్ఞాసువై మొదట వామమార్గోప దేశకుని చూసి ఇట్లు అడుగవలెను - 'స్వామీ! నేను నేటివరకు ఒక గురువునుగాని, ఒక ధర్మమును గాని గ్రహించలేదు. సర్వధర్మములలో ఉత్తమధర్మము ఎవరిదో చెప్పండి, దానినే నేను స్వీకరించెదను.

వామమార్గి:- మాది.....

జిజ్ఞాసువు:– మరి మిగిలిన తొమ్మిదివందల తొంబదితొమ్మిది ధర్మములు ఎట్లున్నవి?

వామమార్గి:– అవియన్నియు అబద్ధములు, నరకమునకు తీసుకుపోవునవియై ఉన్నవి. ఏలయనగా 'కౌలాత్పరతరన్నాస్తి' (కులార్ణవము. 2. 8) అను ప్రమాణమును బట్టి మా ధర్మమును మించినదివేరొక ధర్మమే లేదు.

జిజ్ఞాసువు:– అయ్యా! మీ ధర్మమేమి?

వామమార్గి:– భగవతిని నమ్ముట, మద్యమాంసాది పంచ మకారములు సేవించుట, రుద్రయామలాది 64 తంత్రగ్రంథములను నమ్ముట మొదలుగునవి. నీవు ముక్తిని కోరుకున్నచో మాకు శిష్యుడవు కమ్ము.

జిజ్ఞాసువు:– మంచిది. తక్కిన మహాత్ములనుగూడ దర్శించి, అడిగి తెలిసికొనివచ్చెదను. తరువాత నాకు దేనియందు శ్రద్ధ, ప్రీతి గలుగునో ఆ మతస్థునికే నేను శిష్యుడనగుదును.

వామమార్గి:– అరే ఈ భ్రాంతిలో ఏల పడియున్నావు? వీరు నిన్ను మోసపుచ్చి తమ వలలలో వేసుకొందురు. ఎవ్వరి దగ్గరకు పోకుము. మాకే శరణాగతుడవు కమ్ము, లేకపోతే నీకు పశ్చాత్తాపము కలుగును. చూడుము! మా మతమున భోగము, మోక్షము రెండూ కలవు.

జిజ్ఞాసువు:– మంచిది. చూచిరానిండు; అని ముందుకు వెళ్ళి శైవుని అడుగగా, శైవుడు కూడా అట్టి సమాధానమే చెప్పెను. కాని విశేషముగా అతను శివభక్తి, భస్మరుద్రాక్షధారణ, లింగార్చన, ఇవి లేనిదే ముక్తి దొరకదని చెప్పెను. జిజ్ఞాసువు అతనిని వదలి నవీన వేదాంతిగారి దగ్గరకు వెళ్ళెను.

జిజ్ఞాసువు:– మహారాజా! మీ ధర్మము ఏమిటో చెప్పండి?

వేదాంతి:– మేము ధర్మాధర్మములను వేటినీ నమ్మము. మేమే సాక్షాత్తు పరబ్రహ్మమై యున్నాము. మా యందు ధర్మాధర్మము ఎక్కడ ఉన్నది? ఈ జగత్తంతయు మిథ్యయే. ఎవడు జ్ఞాని, శుద్ధుడు, చేతనుడు కాదలచునో అతడు తానే బ్రహ్మమును అనుకొని జీవుడను భావమును వదలి నిత్యముక్తుడగును.

జిజ్ఞాసువు:– మీరు బ్రహ్మము, నిత్యముక్తులు ఐన మీ యందు బ్రహ్మ గుణకర్మ స్వభావములు ఏల లేవు? ఈ శరీరమునందు ఏల బంధింపబడియున్నారు?

వేదాంతి:– నీకు శరీరములు కనిపించుచున్నవి. దానివలననే కద నీవు భ్రాంతిని కలిగియున్నావు. మాకు బ్రహ్మము తప్ప మరేమీ కానరాదు.

జిజ్ఞాసువు:– చూచు వారైన మీరు ఎవ్వరు? మరి మీరు ఎవరిని చూచుచున్నారు?

వేదాంతి:– చూచువాడు బ్రహ్మము, బ్రహ్మము బ్రహ్మమునే చూచుచున్నాడు.

జిజ్ఞాసువు:– బ్రహ్మములు ఇద్దరాయేమి?

వేదాంతి:– లేదు. తనను తానే చూచుకొనుచున్నాడు.

జిజ్ఞాసువు:– ఎవడైనను తన భుజములమీద తానే కూర్చోగలడా? మీ మాటలు పిచ్చివాని మాటల వలే ఉన్నవే కాని మరేమీ కాదు.

పిమ్మట అతడు జైనులయొద్దకు వెళ్ళి వారిని ప్రశ్నించెను. వారుకూడా అలాగే చెప్పిరి కాని "జైనధర్మము" తప్ప మిగతా ధర్మములన్నియూ అబద్ధములు అని, జగత్తునకు కర్త అనాది ఈశ్వరుడెవ్వడును లేడు అని, అనాది కాలమునుండి ఈ జగత్తు ఇప్పుడున్నట్లే ఉన్నదని, ఇక ముందుకూడా ఇట్లే ఉండగలదని చెప్పి, నీవు మాకు శిష్యుడవగుము. మేము అన్ని విధములుగా ఉత్తములము, ఉత్తమ విషయములను మాత్రమే నమ్ముచున్నాము అని, జైన మార్గము తప్ప మిగతావన్ని అబద్ధమని" (ఈ విషయములను) బోధించిరి.

తరువాత అతడు ముందుకు సాగి క్రైస్తవుని సమీపించి అతనిని అడిగెను. అతడును వామమార్గివలెనే అడిగిన ప్రశ్నలన్నింటికిని ప్రత్యుత్తరము లిచ్చుచు "మనుష్యులందరును పాపులు. కేవలము తమ సామర్థ్యముచే పాపములు దూరముకావు. యేసునందు విశ్వాసము కలుగనంతవరకు ఎవడును పవిత్రుడై ముక్తిని పొందలేడు. అతడు అందరి ప్రాయశ్చిత్తము కొరకు తన ప్రాణములను ధారపోసి దయచూపెను. నీవు మాకు శిష్యుడవు కమ్ము" అని మాత్రము విశేషముగా చెప్పెను.

అది విని, ఆ జిజ్ఞాసువు మౌలీసాహెబుగారి వద్దకు వెళ్ళెను. అతనితో అలాగే ప్రశ్నోత్తరములు జరిగెను. కాని మౌలీసాహేబు (లాషరీక్ ఖుదా) "అద్వైత పరమాత్మను" అతని పైగంబరను, ఖురాన్ షరీఫ్‌ను నమ్మక పోయిన ఎవ్వరికిని ముక్తిలభింపదని మాత్రము విశేషముగా జెప్పెను. అట్లే ఈ మతమును నమ్మనివాడు నరకగామి, కాఫిర్ అనియు బోధించెను.

ఆ మాటలు విని జిజ్ఞాసువు వైష్ణవుని వద్దకు వెళ్ళెను. అతనితో కూడా పైవారితో వలనే సంవాదము జరిగెను. వైష్ణవుడు "మా తిలకచిహ్నములను చూసి యమరాజు కూడ భయపడుచున్నాడు" అని విశేషమును బోధించెను. ఆ మాటను విని జిజ్ఞాసువు తనలో తాను 'దోమలు, ఈగలు, పోలీసువాండ్రు, చోరులు, బందిపోటు దొంగలు, శత్రువులు వీరే భయపడరే. యమరాజకింకరులు ఏల భయపడుదురో' అనుకొని అటులే అందరిని అడుగుచు పోగా అన్నిమతములవారు కూడా తమతమ మతమే సత్యమని చెప్పుచుండిరి. వారిలో నొకడు మా కబీరుడు సత్యమని, ఒకడు నానకు సత్యమని, మరొకడు దాదువని, ఇంకొకడు వల్లభుడని, వేరొకడు సహజానందుడని, మరొకడు మాధవుడని ఇట్లందరూ తమ తమవారే గొప్పవారని, వారందరు అవతారపురుషులని చెప్పిరి. ఇట్లు సహస్ర సంఖ్యాకులను అడుగగా తేలినదేమనగా వీరందరు పరస్పరము ఒకరితో ఒకరు విరోధము కలిగియున్నారని, వీరిలో ఎవ్వడు గురువగుటకు తగినవాడు లేడని అతనికి నిశ్చయము కలిగెను. ఏల అనగా ఒక్కొక్కనిమాట అబద్ధమని 999 మంది సాక్ష్యమిచ్చుచు వచ్చిరి. అసత్యవాదులయిన అంగడివాండ్రవలె, కుంటెనగాండ్రవలె తమతమ వస్తువులు మంచివని పొగుడుకొనుచూ తక్కినవారి వస్తువులు మంచివికావని దూషించు విధముగానే వీరుకూడా చేయుచున్నారు అని తెలుసుకొని,

**తద్విజ్ఞానార్థం స గురుమేవాభిగచ్ఛేత్।**
**సమిత్పాణిః శ్రోత్రియం బ్రహ్మనిష్ఠమ్॥**

(జిజ్ఞాసువు) ఆ సత్యజ్ఞానము కొరకు వాడు సమిత్పాణియై అనగా చేతిలో సమిధను తీసుకొని, వేదవిదుడు, బ్రహ్మనిష్ఠగలవాడు, పరమాత్మను గుర్తెరిగినవాడు ఐన గురువు వద్దకు పోవలెను; పాషండులవలలో చిక్కగూడదు అని తలంచెను.

**తస్మై స విద్వానుపసన్నాయ సమ్యక్ప్రశాంతచిత్తాయ**
**శమాన్వితాయ। యేనాక్షరం పురుషం వేద సత్యం ప్రోవాచ**
**తాం తత్త్వతో బ్రహ్మవిద్యామ్॥**

**ముండకోప. ఖం. 2. మం. 12. 13॥**

ఇట్టి జిజ్ఞాసువు విద్వాంసునియొద్దకు బోయినపుడు అతడు ఈ శాంతచిత్తుడు, జితేంద్రియుడు అగు జిజ్ఞాసువునకు యథార్థ బ్రహ్మవిద్యను, పరమాత్మ గుణకర్మ స్వభావములను ఉపదేశము చేయవలెను; అట్లే వానికి ధర్మార్థ కామమోక్షములను, పరమాత్మను గుర్తెరుగగల ఆయా సాధనములను విశదమగునట్లు బోధింపవలెను.

అతడు అప్పుడు అట్టి పురుషుని వద్దకు వెళ్ళి, మహారాజా! ఈ సంప్రదాయములవారు చెప్పిన విపరీతములవలన నా మతి భ్రమచెందినది. ఏల అనగా నేను వీరిలో ఒకనికి శిష్యుడనైనచో 999 మంది సాంప్రదాయములవారికి విరోధి కావలసివచ్చును, ఒకనికి 999 మంది శత్రువులై ఒకడు మాత్రమే మిత్రుడుగానున్న వానికి సుఖమెన్నటికి గలుగజాలదు. కావున నాకు మీరుపదేశము చేయండి. నేను దానిని అనుష్ఠించెదను అని అతనిని ప్రార్థించెను.

ఆప్తవిద్వాంసుడు:- ఈ మతములన్ని అవిద్యవలన పుట్టి విద్యావిరుద్ధములై ఉన్నవి. ఈ మతములవారు మూర్ఖులు, పామరులు అగు అడవి మనుష్యులను మోసపుచ్చి, వలలో చిక్కించుకొని తమ ప్రయోజనమును నెరవేర్చుకొనుచున్నారు. పాపము! వారు, మనుష్యజన్మ ఫలమునుండి వంచితులై, తమ మనుష్యజన్మమును వ్యర్థముచేసికొనుచున్నారు చూడుము! ఏ విషయములో ఈ వేయి మతములు ఏకీభవించునో అదియే వేదమతము. అదియే గ్రాహ్యము అని తెలుసుకొనుము. ఇక ఏ అంశమున పరస్పర విరోధముండునో అది కల్పితమని, అబద్ధమని, అధర్మమని, గ్రహింపదగనిదని తెలియవలయును.

జిజ్ఞాసువు:- దీనిని పరీక్షించుట ఎలా?

ఆప్తవిద్వాంసుడు:- నీవు వెళ్ళివారితో ఈ విషయములను అడుగుము. వారందరూ ఏకీభవించెదరు. అపుడా జిజ్ఞాసువు వేయిగురు సాంప్రదాయకుల మధ్య నిలబడి అయ్యలారా! మీరందరూ వినండి! ధర్మము సత్యభాషణము నందు కలదా? మిథ్యాభాషణమునందా? అని అడుగగా దానికి వారందరును సత్యభాషణము నందు ధర్మము, అసత్యభాషణము నందు అధర్మము గలదు అనిరి. అట్లైన విద్యాభ్యాసము, బ్రహ్మచర్యపాలనము, పూర్ణయువావస్థయందలి వివాహము, సత్సహవాసము, పురుషార్థము, సత్యవ్యవహారము, ఈ మొదలగు వానిని ఆచరించుట యందు ధర్మము కలదా? లేక అవిద్యాగ్రహణము, బ్రహ్మచర్యము సలుపక పోవుట, వ్యభిచారము, దుస్సాంగత్యము, అసత్యవ్యవహారము, ఛలము, కపటము, హింస, పరహాని మొదలగు కర్మములను ఆచరించుటయందా? అని అడుగగా విద్యాభ్యాసము

మొదలగు కర్మములందే ధర్మము, అవిద్యా గ్రహణాది కర్మములందు అధర్మము గలదని అందరు ఏకగ్రీవముగా అంగీకరించిరి. అప్పుడు ఆ జిజ్ఞాసువు అందరినీ చూసి, మీరందరు అట్లు ఏకాభిప్రాయులై సద్ధర్మాభివృద్ధి కొరకు, మిథ్యా మార్గమునకు హాని గలిగించుటకు ఎందుకు పాటుపడరని అడుగగా వారు మేము అట్లుచేసిన మమ్ములను ఆదరించేదెవరు? మా శిష్యులు కూడా మా ఆజ్ఞకు లోబడి ఉండరు. మా జీవికకును నష్టము కలుగును మరి మేము అనుభవించుచున్న ఆనందమునకు భంగము కలుగును. కావున మేము తెలిసి కూడా మా మా మతములనే బోధించుచు పట్టుదలకలిగియున్నాము. ఏల అనగా "రొట్టెను చెక్కెరతో తినవలెను. లోకమును టక్కులతో జయింపవలెను" అను లోకోక్తిగలదు. ప్రపంచ మెట్లున్నదో చూడుము. న్యాయచింతన గలిగి సత్యవర్తియైన మనుష్యునకు ఎవ్వడు ఒక్క రూపాయ కూడా ఇవ్వడు. వానిని ఎవ్వడూ ఉన్నావా అని కూడా అడుగడు. మోసము, కపట వంచనలు చేయువారికే అన్ని వస్తువులు లభించును.

**- సశేషం** ✦

---

వీరేశలింగం అనగానే వితంతు పునర్వివాహాలు ప్రధానంగా గుర్తొస్తాయి. కాని సమాజంలో పేరుకుపోయిన ప్రతి చెడును ఆయన చీల్చిచెండాడారు. ఆచారాలు, శాస్త్రాల పేరిట సాగిన బూటకాలను పటాపంచలు చేశారు. పెద్దమనుషుల అల్పబుద్ధులను బదాబదలు చేశారు. ఆనాటికి అది గొప్ప సాహసమే. ఈ నాటికి కూడా వాస్తు పేరిట, శకునాల పేరిట సాగే తతంగాలను చూస్తూనే ఉన్న మనం వీరేశలింగం అన్నేళ్ళ కిందటే వాటిని వినోదాత్మకంగా, విశ్లేషణాత్మకంగా చెప్పిన తీరుకు విస్తుపోకుండా ఉండలేం. ఆయన రచించిన "హాస్య సంజీవని" అనే పుస్తకములో నుంచి 'గొట్టాలమ్మ సభ' అనే రచనను యధాతథముగా ఈ సంచిక యందు ప్రచురించుచున్నాము.

# గొట్టాలమ్మ సభ

**- శ్రీ కందుకూరి వీరేశలింగం**

**(మాదిగమల్లిగాడును, గమళ్లగాలిగాడును, పూజారి పూర్ణయ్యయు, కాపుకామయ్యయు ప్రవేశించుచున్నారు.)**

కామ -- ఓరేమల్లిగా! ఊళ్లో అమ్మవారి జాడ్యాలు ఇలాగు ఉన్నప్పుడు మనం అమ్మవారిని నడివీధిలో నిలపనక్కరలేదుట్రా!

మల్లి -- బాబూ! తప్పకుండా నిలపాలండి. మాకు డప్పులపని లేకపోవడం చేత కల్లునీళ్లకి లేక చచ్చిపోతూ ఉన్నాము. మా వాళ్లనందరినీ పోగుచేస్తాను. తప్పకుండా ఉత్సవం చేయించండి. ఈ మూలంగానైనా మాకు నాలుగు డబ్బుల సొమ్ము దొరుకుతుంది.

గాలి -- అవునండి తప్పకుండా చెయ్యవలసిందే. వాళ్ళకే కాదు. మాకూ నాలుగు డబ్బుల సొమ్ము దొరుకుతుంది. ఇప్పుడు మన ఊళ్లో ఎంతమంది కల్లుతాగే వాళ్లు ఉన్నా ఈ ఉత్సవదినాలలో వలె ఎప్పుడూ ఖర్చుకాదు. కావలిస్తే మా వాళ్లనందరినీ పోగుచేసి ఉత్సవానికి కావలసినంత సరంజాం చేయిస్తాను. ఇచ్చుకోమంటే తలా రెండణాలూ చందా ఇచ్చుకుంటాము.

కామ -- ఇక అంతా కుదిరింది. పూర్ణయ్యా! నీవేమంటావు?

పూర్ణ -- నేననేది ఏమున్నది? మీ చిత్తము. నాలుగు డబ్బుల సొమ్ము దొరికేటప్పుడు నాకూ సంతోషమే. ఈ యేడు వేటపోతులూ, బియ్యమూ చాలా దొరుకుతవి.

కామ -- అందుకు సందేహం లేదు! వెయ్యి యేటపోతులూ, పదివేల కోడిపెట్టలూ తెగకపోతే నన్ను ఈ పేరున పిలువవద్దు. పాపిష్టి దేవుడు మాంసం నిలవవుండకుండా చేసినాడు కాని లేకపోతే యేటికి యేడాదీ ఈ మాంసం మనందరికీ పుష్కరంగా సరిపోను.

పూర్ణ -- కామయ్యగారూ! ఇందులో ఇంకొకటి ఉన్నది. బ్రాహ్మలూ, కోమట్లూ నరికించే వేటపోతులు మాత్రమే మనకు దక్కుతవిగాని శూద్రులవి ఒక్క తలమాత్రం ఇచ్చి తక్కిన భాగం వాళ్లే పట్టుకు వెళతారు. అది లేకుండా చేస్తారూ.

కామ -- ఇప్పుడు మనం ఆ ప్రయత్నం చెయ్యకూడదు. ముందు ఆ సంగతి ఆలోచింతాము. బ్రాహ్మలు ఇచ్చే మేకపోతే మనకు నెత్తికీ నేలకు కూడా చాలును. అంతగా చాలకపోతే తరువాత మన గణాచారిగాడి చేత మేకపోతులను ఇంటికి పట్టుకుపోతే రోగాలు ఎక్కువ చేసి ఊరందరినీ చంపుకుని పోతాననిపింతాము. అమ్మవారు ఇలా గన్నదంటే అందరూ మేకపోతులను మనకు ఇచ్చేపోతారు.

మల్లి -- నేను ఇప్పుడే చెపుతూ ఉన్నాను. తెగిన మేకపోతుల తలకాయలన్నీ మా వాళ్లవి సుమండీ తరువాత లేదనేరు.

కామ -- సరే మామూలు ఎలాగో అలాగే జరగవచ్చును పూర్ణయ్యా! ఇప్పుడే చెపుతూ ఉన్నాను. దొరికే బియ్యంలోనూ దక్షిణలలోనూ సగం మాదీ సగం మీదీ సుమా. తగువులు పెడితే పనికిరాదు.
పూర్ణ -- అలా కాదు. కష్టపడేవాళ్లము మేముగనుక రెండువంతులు మాకిచ్చి వక వంతులు మీరు పుచ్చుకోండి.
కామ -- అలా వల్లపడదు. మాకు సగం వంతు ఇస్తేనే ఉత్సవం జరుగుతుంది. లేకపోతే జరగనే జరగదు. నన్ను కలుపుకోకుండా మీరు పాకలు వేయిస్తురూ మరునాటికి తగులబడతాయో లేదో మీరే చూస్తారు.
పూర్ణ -- మీ ఇష్టం వచ్చినట్టే మీరు పుచ్చుకోండి. బాజా వాళ్లకూ డప్పుల వాళ్లకూ అయ్యేఖర్చు పోగా మిగిలేదాంట్లో సుమండీ మీకు సగం ఇవ్వడం. ఆనికు అంతలోనూ సగం తెమ్మంటారు.
కామ -- అలా తెమ్మనడానికి నేను మాత్రం న్యాయం యెరుగనివాణ్నా? అన్ని ఖర్చులూ పోగా మిగిలినదానిలోనే చెరి సగము పుచ్చుకుందాము. అవునుగాని నీవు గరగలను ఎత్తుకుని వీధులలో తిరిగేటప్పుడు అమ్మవారు ఏమి చెప్పిందని చెపుతావు?
పూర్ణ -- అదీ మీరే సెలవియ్యవలెను.
కామ -- మంచిది ఆలోచించి చెపుతాను ఉండు. సర్కారువాళ్ల మాటవిని వేపరొట్టలు కట్టకుండా, గంధకమూ, తారూ పొగలు వెయ్యడం చేత నాకు కోపం వచ్చి ఇలాగు చంపుతూ ఉన్నాని ముఖ్యంగా చెప్పవలెను. తరువాత నాకు జాతరలూ ఉత్సవాలూ చెయ్యడం మానివేసినారు. ఇప్పుడైనా బుద్ధి కలిగి నాకు జాతరలు చేయించకపోతే శవాలను బళ్లతో తోలేటట్టు చేయిస్తానన్నదని చెప్పు. మరిచిపోకుండా ఈ రెండున్నూ ముఖ్యంగా చెప్పవలెను. అలా చెప్పకపోతే ఇంగ్లీషు చదువుకున్న వాళ్ల మాటలు నమ్మి దొడ్లుశుభ్రం చేసుకోవడమూ, గోడలకు వెల్ల వేసుకోవడమూ, నీళు కాచి వడకట్టి తాగడమూ, తారూ, గంధకమూ పొగలు వెయ్యడమూ ముఖ్యంగా చూసుకుంటారుకాని మనకు బియ్యాలు ఇవ్వడమూ, చలిమిడీ, నానుపప్పూ నైవేద్యాలు పెట్టడమూ, వేటపోతులను ఇవ్వడమూ ముఖ్యంగా చూడరు.
పూర్ణ -- అది సరేకాని ఈ గంధకపు పొగలవల్లనూ వాటి వల్లనూ ఏమైనా కార్యం ఉన్నదీ?
కామ -- కార్యం ఉన్నదీ లేకపోయినదీ అదంతా మనకెందుకు? మనకు నాలుగు డబ్బులు సొమ్ము దొరికేపని మనం చూచుకుందాము. మనకు బలులు ఇచ్చేవారికందరికీ రోగాలు రాకుండానూ వచ్చిన వాళు చావకుండానూ మానుతూ ఉన్నవా? యేమి చేసినా చచ్చేవాళ్లు యెలాగూ చస్తారు. బ్రతికేవాళ్లు ఎలాగూ బ్రతుకుతారు. గాలిలోనూ నీళ్లలోనూ యేమి ఉన్నది? ఈ గోదావరీ, ఈ గాలీ ప్రపంచం పుట్టినప్పటినుంచీ ఉన్నవిగాని బ్రహ్మదేవుడు వీటిని కొత్తగా పుట్టించి నాడా ఏమిటి?
పూర్ణ -- పోనియ్యండి ఆయుర్దాయం ఉంటే ఎలాగూ బ్రతుకుతారు. ఆ సంగతి మనకెందుకు గాని అమ్మవారు మూకుట్లో యేమిపడ వేసిందని అడుగుతారు. యేమి చెప్పుమన్నారు?
కామ -- యేమి చెప్పుమన్నావా? పసుపూ కుంకమూ పడవేసిందని చెప్పు. ఇక నాకు తిన్నగా సేవచేయిస్తే మీ పసుపూ, కుంకమూ చల్లగా ఉంచుతానని అమ్మవారి అభిప్రాయం అని అర్థం నీవు విప్పి చెపుతూ ఉండు.
పూర్ణ -- అలాగే చెపుతానుగాని పదిమంది గణాచార్లనూ శివశక్తులనూ పోగుచేస్తారు?
కామ -- ఇప్పుడు అంతమందిరారు. ఎవళ్లనయినా డబ్బు ఇచ్చి రోజుకూలికి తీసుకుని రావలెను. వాళ్లయినా మునుపటిలాగు అల్లరి చెయ్యడానికి వల్లకాదు. వాళ్ల ఇంటికాడ గంతులు వేస్తే పిల్లవాడు జడుసుకున్నాడని కిందటి మాటు ఒకతురక సాహేబు ఒక శివశక్తిని చావతన్నినాడు. అప్పటి నుంచీ భయం చేత ఎవళ్లూరారు. ఒక్కతురక సాహేబేకాదు మనవాడు కూడా ఒక గణాచారి తననేమో తిట్టినాడని కోపం చేత తిన్నగా బజారుకు పరుగెత్తి పేకబెత్తం కొనుక్కుని వీభూతి పూసుకుని వేపమండలు చేతితో పట్టుకుని తన పగతీరేటట్టుగా పడకొట్టినాడు. మామూలుగా వచ్చే ఆ ముండలు మాత్రం ఇద్దరు వస్తారు.
పూర్ణ -- వాళ్లే చాలును లెండి. వాళ్లకు కాసిన్ని కల్లునీళు పోయిస్తే కొంచెం తూలుతూ నడుస్తారు. ఒళ్ళు తెలిసి ఉంటే ఎవరైనా కొట్టిపోతారేమో అనే భయం చేత వాళ్లయినా ఆ కాస్త అల్లరీ చెయ్యరు. ఇప్పుడన్నీ కాని కాలాలు వచ్చినవి.
కామ -- అవును. ఇప్పుడు కాలం మంచిదికాదు. మనం వెళుదాము రండి. రేపు ఊళ్లో నలుగురితోను చెప్పి మీటింగు చేయించి అమ్మవారి ఉత్సవం నిమిత్తం చందాలు చేయింతాము. మన ఊళ్లో అధమం ఐదు వందలయినా చందాకాకపోతవా?

(అని మాట్లాడుకుంటూ వెళ్లుచున్నారు.)

# ధర్మరాజు - ఆచార్యుడు

- శ్రీదేవి

పూర్వం కుశాలదేశం అనే రాజ్యం ఉండేది. ఆ దేశాన్ని ధర్మరాజు అనే రాజు పరిపాలించేవాడు. అతని పేరులోనే కాదు అతని రాజ్యపాలనలో కూడా ధర్మం ఉంటుందని అందరూ చెప్పుకునేవారు. అతడు ప్రజలంటే వాత్సల్యము కలవాడు. అతని పాలనలో ప్రజలందరు ఎంతో సుఖ, సంతోషాలతో ఉండేవారు. ఆ రాజ్యం ఎప్పుడు కళకళలాడుతుండేది.

